విశాలాంధ్ర గోదావరి జిల్లా
కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఎన్నికల సన్నద్ధతపై సీఈవో సమీక్ష

విశాలాంధ్ర - కాకినాడ : ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) ముఖేష్ కుమార్ మీనా అమరావతి నుంచి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ (ఈఆర్ఓ) అధికారులతో కలిసి హాజరయ్యారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 రూపకల్పన, ఓటర్ల సవరణ జాబితా అభ్యంతరాల పరిష్కారం, ఎలక్టోరల్ రోల్స్, బీఎల్ రిజిస్టర్, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ, న్యూ ఎన్రోల్మెంట్, రాబోయే సాధారణ ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై ఎన్నికల సీఈవో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ ఇలక్కియ మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా రూపకల్పన నిరంతర ప్రక్రియని, దీనిపై ఈఆర్ఓలు ప్రత్యేకంగా దృష్టిపెట్టాలన్నారు. ఈఆర్ఓలు క్షేత్రస్థాయి బీఎల్ఓలను సమన్వయం చేసుకుని తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటు నమోదు ప్రక్రియపై క్షేత్రస్థాయి అధికారులు దృష్టి పెట్టి యువతకు మరింత విస్తృత అవగాహన కల్పించాలని జేసీ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో కె శ్రీధర్ రెడ్డి, కెఎస్ఈజడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె మనోరమ, కుడా వీసీ సుబ్బారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎన్‌వీవీ సత్యనారాయణ, జే సీతారామారావు, వివిధ కార్పొరేషన్ కమిషనర్లు, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆజాద్ తీరే వివాదాస్పదమా...

విశాలాంధ్ర - అన్నవరం : కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ప్రవర్తిస్తున్న తీరే వివాదాస్పదమవ డానికి కారణాలు అవుతున్నాయి. ఎక్కడ పనిచేసినా ఆయనపై ఫిర్యాదుల పరంపర కొనసాగుతుండటం సర్వసాధారణం. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర ప్రారంభానికై అన్నవరం దేవస్థానంలో గల సీతారామరాజు గెస్ట్ హౌస్‌లో వసతికి మంగళవారం చేరుకున్నారు. ఈ సందర్భంలో దేవస్థానం తరుపున ఈఓ ఆజాద్ స్వాగతం పలకవలసి ఉండగా ఎసి రమేష్ బాబు స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ బుధవారం 11 గంటల ప్రాంతంలో స్వామి వారి దర్శనానికి వచ్చినప్పుడు ఆలయ మర్యాదలతో ఈఓ ఆజాద్ డ్యూటీలో ఉండి స్వాగతం పలక వలసి ఉండగా అతని స్థానే ఎసి రమేష్ బాబు, పిఆర్ఓ కృష్ణలు స్వాగతం పలకడం విశేషం. డ్యూటీలో ఉండి పవన్‌కు అతను ప్రోటో కాల్ ఉల్లంఘించి సాయత్రం బైపాస్‌లో గల దేవస్థానానికి సంబంధించి అభివృద్ధి పనుల సూచనలు, సలహాలు ఇవ్వడానికి చీకట్లో అధికార వాహనంలో వెళ్లడం పై జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ స్థాయి ఏమిటో తెలుసుకోకుండా అవమానపరిచిన ఏఓ ఆజాద్ పై కమిషనర్ సత్యనారాయణ ప్రోటో కాల్ ఉల్లంఘించారా లేదా అన్నవిషయంపై దర్యాప్తు చర్యలు తీసుకోవాలని పలువు జనసేన నాయకులు కోరుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - అంబాజీపేట : ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలలో గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన వరి రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు మట్ట మహాలక్ష్మి ప్రభాకర్ డిమాండ్ చేశారు. పి గన్నవరం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గంగుమళ్ల వీరభద్రరావు అధ్యక్షతన స్థానిక వెంకటరాజు ఫ్లోర్ అండ్ ఆయిల్ మిల్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహాలక్ష్మి ప్రభాకర్ మాట్లాడుతూ గత నెలలో కురిసిన భారీ వర్షాలకు రబీ సీజన్లో పండిన ధాన్యమును కొనుగోలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం వహించడంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వరి రైతులను ఆదుకోవాలని ఉభయగోదావరి జిల్లాలలోని కలెక్టరేట్ల వద్ద టిడిపి రైతు విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా టిడిపి అధిష్టానం దృష్టికి వెళ్లిందన్నారు. దీంతో రాష్ట్ర రైతు విభాగం స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పంట నష్టం బయటపడిందన్నారు. దీంతో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఉభయగోదావరి జిల్లాలో పర్యటించడంతో రాత్రికి రాత్రే సంబంధిత అధికారులు ధాన్యంను కొనుగోలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నామన రాంబాబు, డొక్కా నాథ్ బాబు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని బాలిక మృతి

విశాలాంధ్ర - కొత్తపేట : ఉరివేసుకుని బాలిక మృతి చెందినట్లు కొత్తపేట ఎస్సై వి. మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని గంటి పెద్ద పేటకు చెందిన వాడపల్లి జ్యోతి(16) ఇటీవలే పదవ తరగతి ఉత్తీర్ణురాలయ్యింది. ఇంటర్ చదువుతాను అని తండ్రిని అడగడంతో చదివించే స్తోమత లేదు ఇక చదువు వద్దు అని తండ్రి చెప్పడంతో మనస్థాపానికి గురైన బాలిక ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుంది. ఇంతలో బాలిక తమ్ముడు చూసి కేక వేయడంతో కుటుంబ సభ్యులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై బాలిక తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శ్రమదానంతో రోడ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని రామవరం రంగవల్లి నగర్ కాలనీలో శ్రమదానం ద్వారా రోడ్లు ఏర్పాటు చేసుకున్నామని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. రోడ్లకు గ్రావెల్‌ను ఆ కాలనీవాసులతో కలిసి అయన వేశారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ గత 20 ఏళ్ళుగా ఇక్కడ నివాసం ఉంటున్నా ప్రజాప్రతినిధులు మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ఇక్కడకు ఓట్లు అడగటానికి వస్తున్నారుగానీ, రోడ్లు వంటి సదుపాయాలను కల్పించడంలేదన్నారు. తాము సుమారు 3 లక్షల రూపాయలతో రోడ్లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఇక్కడకు ఓట్లు అడగటానికి ఎవ్వరినీ రానివ్వమని, వచ్చే సార్వత్రిక ఎన్నికలను రైతు కూలీ సంఘం బహిష్కరిస్తుందన్నారు. ఈ కార్యక్ర మంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, పిడియస్‌యు (విజృంభణ) సతీష్ పాల్గొన్నారు.

19న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఇన్నిస్ సిస్టమ్ ఐఎన్సి కంపెనీలో యుఎస్ ఐటి రిక్రూట్మెంట్, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్, ఒపిటి రిక్రూటర్స్, యాక్సస్ బ్యాంక్‌లో బిడిఇ, అసిస్టెంట్ మేనేజర్, జియో ఫైబర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, నిట్ (ఐసిఐసిఐ) బ్యాంక్ రిలేషన్షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ, ఇసుజు మోటార్స్, డిక్సాన్ & సియాన్ ఇ-హెచ్ డబ్ల్యుఎ సుమిత్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, & బిటెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ.11,000 నుండి రూ. 25,000 వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 19వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్: 7799376333 సంప్రదించవలెను.

అచ్చెన్నాయుడును కలిసిన మండల నాయకులు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఏపి టీడీపీ అధ్యక్షులు అచ్చెన్నాయుడును అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మామిడికుదురు మండల టీడీపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ సంస్థాగత విషయాల పై నివేదికను అందజేసి గ్రామాల్లో పార్టీ అభివృద్ధి పై చర్చించారు. ఈ కార్యక్రమంలో సూదా బాబ్జి, ఈలి శ్రీనివాస్, వర్ధినీడి బాబ్జి, వాసంశెట్టి శంకర్రావు, ఉంద్రు శ్రీరామరావు, కడలి కృష్ణమోహన్, అప్పారి వెంకటేశ్వరరావు, కంచి విశ్వనాథం, ఇంటి గణపతి, పెచ్చెట్టి భాస్కరరావు, కంచి దామోదర ప్రతాప్, సాపే ఏకాదశి, గోకవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం ఘటనపై మేజిస్టీరియల్ విచారణ చేయాలి

- 21న తిరుమలాయపాలెంకు రాజకీయ దళిత సంఘాల భరోసా యాత్ర
- 17న జిల్లా కలెక్టర్‌కు వినతి : సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు మధు, అరుణ్

విశాలాంధ్ర-రాజమండ్రి: గోకవరం మండలం తిరుమలపాలెం లో అంబేద్కర్ విగ్రహం తొలగింపు ఘటనలో అర్ధరాత్రి దళితులపై దాడిచేయడం... రక్షించ వలసిన పోలీసులు మహిళలు చిన్న పిల్లలు అని చూడకుండా చీరలు లాగేసి కొట్టడం దారుణమని ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి మేజిస్ట్రేట్ విచారణ చేయాలని, పోలీసులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి అరుణ్ డిమాండ్ చేసారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో వామపక్షాల సమావేశం జరిగింది. జిల్లాలో జరుగుతున్న పలు ఘటనలు, అభివృద్ధి పేరుతో ప్రజా ప్రతినిధులు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం, గోదావరి చెంతనే వున్నా నగర వాసులకు మంచినీరు లేకపోవడం , పేపర్ మిల్ యాజమాన్య వైఖరి, కరెంట్ చార్జీలు పెరగడం తదితర అంశాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు .ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ దళిత ఓట్లతో అధికారం లోకి వచ్చిన ముఖ్యమంత్రి నేడు ఆ దళితులపైనే దాడులు చేస్తున్నారని అన్నారు. తిరుమలపాలెం ఘటన ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని అన్నారు. పోలీసుల దాడివల్ల అనేక మంది గాయపడ్డారని నలుగురు మహిళలు ఇప్పటికి ఆసుపత్రిలో వున్నారని వారు తెలిపారు. స్వయంగా ఎస్‌సి కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ భాదితుల గోడు విన్నాక పోలీసులు రౌడీల్లా ప్రవర్తించారని చెప్పారంటే ఈ ఘటన ఎంత హేయంగా ఉందో అర్థమవుతోందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఇరువర్గాల శాంతి కమిటీ వేయాలని 5 రోజుల్లో దాడిలో పాల్గొన్న పోలీసుల ను అరెస్ట్ చేయాలని కోరారు. శనివారం జిల్లా కలెక్టర్ ను కలుస్తామని, 21 న తిరుమలపాలెం కు రాజకీయ ప్రజాసంఘాల దళిత సంఘాల నాయకు లందరూ భరోసా యాత్ర చేపడుతున్నా మని అక్కడే ప్రజల సమక్షంలో పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కుంద్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి. కొండలరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజు లోవ , సిపిఎం సీనియర్ నాయకులూ ఐ. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - కాకినాడ/రామచంద్రపురం : ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన అందరికీ ప్రతి సంక్షేమ పథకాలు అందుతున్నాయని రాష్ట్ర బీసీ సంక్షేమం సమాచార పౌర సంబంధాలు సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తెలిపారు. శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గం రామచంద్రపురం పురపాలక సంఘం 12వ సచివాలయ పరిధిలోని 28వ వార్డులో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి గడపగడపకు తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై లబ్ధిదారుల నుండి స్పందనను తెలుసుకున్నారు. ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ పథకాలు కుల, మతం భేదం లేకుండా పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు తమకు ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అందులో భాగంగా ఉన్న డ్రైనేజీ సమస్యలతో పాటు రోడ్లు సమస్య గురుంచి మంత్రి దృష్టికి తీసుకురాగా డ్రైనేజీ సమస్య పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని ఆదేశించారు. అనంతరం రామచంద్రపురం పట్టణంలోని మున్సిపాలిటీ వాటర్ పైప్ లైన్‌లను వాటర్‌ను పరిశీలించి క్లోరిన్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. రామచంద్రపురం పట్టణానికి తాగునీటి సమస్య లేకుండా స్వచ్ఛమైన ఆరోగ్యవంతమైన తాగునీరు అందిస్తామని మంత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పురపాలక సంఘం కమిషనర్ కే శ్రీకాంత్ లతోపాటు, పురపాలక శాఖ విప్ వాద్రేవు ప్రసాద్, 28వ వార్డు కౌన్సిలర్ కే లలిత గణేష్, ఇతర కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-దేవరపల్లి: నాయి బ్రాహ్మణ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మార్కాపురం కనకారావు తెలిపారు. దేవరపల్లి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో మండల నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కడియం సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కనకారావు మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు అనేక సమస్యలు ఉన్నాయని వాటిలో కొన్ని సమస్యలు ప్రభుత్వాలు పరిష్కరించినా మరికొన్ని సమస్యలు పరిష్కరించవలసి ఉందని అన్నారు ముఖ్యంగా దేవాదాయ శాఖలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు పే స్కేల్ అమలు చేయాలని ఆయన అన్నారు. కనీస వేతనం రూ.20,000 ఇవ్వాలని, ప్రతి మున్సిపాలిటీలోనూ పంచాయతీలోను నిర్మించే షాపులలో నాయి బ్రాహ్మణులకు ఒక షాపు కేటాయించాలని అన్నారు. ఈ సందర్భంగా దేవరపల్లి మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండలం నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా కడియం సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపాలపురం నియోజకవర్గ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా దేవరపల్లికి చెందిన జాజిమొగ్గల శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం అధ్యక్షుడు మున్నంగి కిరణ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి మేడూరి వీర్రాజు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడు తురాయి శ్రీను మండల నాయి బ్రాహ్మణ సంఘం నేతలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు

విశాలాంధ్ర - తాళ్లపూడి : ఎంఆర్‌పి కంటే అదనంగా రేటు వసూలు చేసే వారి పై కఠిన చర్యలు తప్పవని తూనికలు కొలతలు శాఖ అధికారి సాయి రామ్ పేర్కొన్నారు. మార్కెట్లో ప్రతి వినియోగదారుడు తాను వస్తువులను కొనుగోలు చేసే సమయంలో ఎం.ఆర్.పి కంటే ఎక్కువ రేటు షాప్ యజమాని డిమాండ్ చేసి నట్లయితే తప్పని సరిగా అది చట్ట రీత్యా నేరమవు తుందన్నారు. బిల్ కూడా అడిగి తీసుకోవచ్చని ఇబ్బందులు ఉంటే తూనికలు కొలతలు శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని లీగల్ మెట్రోలజీ అసిస్టెంట్ కంట్రోలర్ బి. సాయి రామ్, ఇన్స్పెక్టర్ జి.వి ప్రసాద్ పేర్కొన్నారు. స్పందనలో రావు, శ్రీను అనే వ్యక్తులు చేసిన ఫిర్యాదు మేరకు లీగల్ మెట్రోలజీ అధికారులు తమ సిబ్బందితో ఆకస్మిక తనిఖీ చేశారు. తాళ్ళపూడి, ప్రక్కిలంక, కుమారదేవం గ్రామాల్లో గల పెట్రోల్ బంక్ లలో శుక్రవారం లీగల్ మెట్రోలజీ అధికారుల తనిఖీలలో తేడాలు దొరకలేదని సాయిరామ్ పేర్కొన్నారు. పలువురు వినియోగదారులు మాత్రం అధికారుల రాకను ముందే పసిగట్టారని ఆరోపిస్తున్నారు. కొలతలతో పాటు నాణ్యత పై కూడా ఆరోపించిన నేపథ్యంలో తూనికల వరకు తాము బాధ్యులమని, నాణ్యత విషయం లో పెట్రోల్ కంపెనీ సేల్స్ మెన్ లకు నేరుగా ఫిర్యాదు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

తహసీల్దారును మర్యాదపూర్వకంగా కలిసిన వీఆర్ఏలు

విశాలాంధ్ర - అనపర్తి : అనపర్తి మండల తహసీ ల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సరస్వతిని వీఆర్ఏలు మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలు ఆమెను కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం తహసిల్దార్ సరస్వతితో కొద్దిసేపు మాట్లాడారు.

నూతన ఎంపీడీవోకు అభినందనలు

విశాలాంధ్ర - ఉంద్రాజవరం: ఉంద్రాజవరం మండల పరిషత్ నూతన అధికారిగా బాధ్యతలు స్వీకరించిన గాదిరాజు రామకృష్ణంరాజు, ఇన్‌చార్జి ఈఓపిఆర్‌డిగా బాధ్యతలు చేపట్టిన రామప్రసాదులు మండలాన్ని అభివృద్ధి దిశగా పయనింపజేస్తారని ఆశిస్తున్నట్లు తాడిపర్రు సర్పంచ్ కె.నరేంద్రబాబు తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిరువురిని మర్యాద పూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపినట్లు నరేంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో తాడిపర్రు పంచాయతీ కార్యదర్శి పి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి జగనన్న సురక్ష

విశాలాంధ్ర - తాళ్లపూడి :జగనన్న సురక్ష పేరిట ప్రభుత్వం ఓ బృహత్తర పథకాన్ని జూన్ 23 నుండి అమలు లోకి తీసుకు రానున్నట్లు తహశీల్దార్ రాధిక తెలిపారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న 540 పౌర సేవలను జూన్ 23 నుండి జులై 22 వరకు నెల రోజులపాటు ఎటువంటి రుసుము లేకుండా ఉచితంగా సంబంధిత సర్టిఫికెట్లను అందించాలన్నది ప్రభుత్వ ఆదేశమని తెలిపారు. ఈ మేరకు తాళ్ళపూడి మండలం లోని 15 గ్రామ సచి వాలయాలకు గాను రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేస్తున్నామని, తహసీల్దార్, ఈఓపిఆర్డీ ఒక టీమ్, ఎంపీడీఓ , డిప్యూటీ తహసీల్దార్ ఒక టీమ్ గా వుంటారని తెలియచేశారు. ఈ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రతి 50 ఇళ్లకు కేటాయించిన వలంటీర్లు ముందుగానే తన పరిధి లోని ఇళ్లకు వెళ్లి ప్రజలనుండి అవసరమైన పౌర సేవలు తెలుసుకుని అధికారుల ముందుంచటం, జులై 22 న జరిగే గ్రామసభలో సర్టిఫికెట్లను అందచేస్తామని తహసీల్దార్ తెలిపారు. దీనికి సంబంధించి, జరిగిన వి.సి. లో తహసీల్దార్ తో పాటు ఎంపీడీఓ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ అహ్మద్, సబ్ రిజిస్ట్రార్ మస్తాన్, రి సర్వే డిటి భారతి తదితరులు పాల్గొన్నారు.

ఆహారం పెడతానని చిన్నారిపై అత్యాచారం

- చికిత్స పొందుతున్న ఆరేళ్ల బాలిక
- నిందితుడు పై పోక్సో చట్టం కేసు నమోదు

విశాలాంధ్ర - రాజానగరం : ఆరుబయట అటలాడుకుం టున్న ఆరేళ్ల, ఎనిమిదెళ్ళ ముక్కుపచ్చ లారని చిన్నారులకు ఆహారం పెడతానంటూ 40 ఏళ్ల వ్యక్తి తన కామవాంఛను తీర్చు కున్నాడు. ఈ సంఘ టనకు సంబంధించి రాజా నగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండపేట మండలంలోని ద్వారపూడి గ్రామానికి చెందిన షేక్ మీరా వల్లి(40)గత కొంతకాలంగా రాజానగరంలో ఓ కాలనీలో అత్తమామల ఇంటి వద్దే తాళాలు బాగుచేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. రోజువారి కూలి పనులు చేసుకుంటున్న నిరుపేద దంపతులు ఆ సమీపంలోనే నివాసం ఉంటున్నారు. వీరికి ఆరేళ్ళు,ఎనిమిదేళ్ళ వయస్సున్న ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఎప్పటిలాగానే కుటుంబ పోషణ నిమిత్తం ఈ నెల 15వ తేదీన కూలి పనులకు తల్లిదండ్రులు బయటకు వెళ్లగా, సాయంత్రం ఇద్దరు అమ్మాయిలు ఆరుబయట ఆడుకుంటున్నారు. గమినించిన షేక్ వలి ఆ చిన్నారులిద్దరికీ ఆహారం పెడతా అని కల్లబొల్లి మాటలు చెప్పి గదిలోకి తీసుకువెళ్లి పెద్ద అమ్మాయి పై అత్యాచారానికి పాల్పడు తుండగా భయం తో పరిగెత్తుకుంటూ బయటకు పారిపోయింది. అక్క తప్పించుకున్నప్పటికి ఆరేళ్ల చిన్నారి అని కనికరం కూడా లేకుండా చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కూలి పనులు నుండి ఇంటికి వచ్చిన తల్లికి చిన్నారి రక్తస్రావంతో ఏడుస్తూ కనిపించడంతో జరిగిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.వెంటనే చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్య చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.నిందితుడు పై పొక్సో చట్టం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైక్వాండోలో దివ్యకు రజత పతకం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం ఈసీఈ చదువుచున్న కే దివ్య డెహ్రాడూన్ ఉత్తరా ఖండ్‌లో నిర్వహించిన సీనియర్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా దివ్యను డీన్ డాక్టర్ పిఎస్‌వివి ఎస్ఆర్ కుమార్, ఈసిఇ విభాగాధిపతి డాక్టర్ జి. రామకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టిఎస్‌విఎస్ రామచంద్రన్, ఫిజికల్ డైరెక్టర్స్ డాక్టర్ ఎన్.రవి, శంకర్‌రావు తదితరులు అభినందిం చారు.

ఈస్టాంప్ కౌంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ -స్టాంప్ కౌంటర్‌ను ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కామన్ సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి) ఆధ్వర్యంలో ఈ కౌంటర్‌ను స్థానిక ప్రత్తిపాడు సిఎస్‌సి సెంటర్ నిర్వాహకుడు పోలిశెట్టి త్రిమూర్తులు నిర్వహిస్తారు. శుక్రవారం నుండి ఆన్ లైన్ నాన్ జ్యూడీషి యల్ ఈ స్టాంపులు ప్రత్తిపాడు సబ్ రిజిస్టర్ కార్యాల యంలో అందు బాటులో ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌సి జిల్లా మేనే జర్లు రాజేష్, ఆదిత్య, సబ్ రిజిస్టర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తూ॥గో॥ జిల్లా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టులో

C.I.P.No.13 of 2023

Between:

పసగాడ రఘు ... పిటిషనరు

And

ఉప్పాడ రామ త్రినాధరెడ్డి వగైరాలు ... రెస్పాండెంట్లు

రెస్పాండెంట్లు: **R1.** ఉప్పాడ రామ త్రినాధరెడ్డి **S/o.** ఆదినారాయణ, 43 సం॥లు, D.No.5-377, శ్రీరామ్‌నగర్, రాజానగరం, తూ॥గో॥జిల్లా.

R2. ఉప్పాడ సునీత **W/o.** ఉప్పాడ రామత్రినాధరెడ్డి, 32 సం॥లు, do-do.

R3. కట్టా అరుణ **W/o.** ప్రశాంత్ కుమార్, 40 సం॥లు, D.No.30-3-12, సైదుల్ పేట, మండపేట, తూ॥గో॥జిల్లా

R4. అఫీషియల్ రిసీవర్, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లా

ఇందుమూలముగా మీకు తెలియచేయునది ఏమనగా 1వ రెస్పాండెంట్ను ఇన్సాల్వెంటుగా డిక్లేర్ చెయ్యమని, **Document No. No.1503 of 2023 dated 15-02-2023** దస్తావేజును రద్దు పరపించమని, 4వ రెస్పాండెంటు ద్వారా పిటిషను షెడ్యూలు ఆస్తిని వేలంవేయించి వేలం సొమ్ముతో పిటిషనరు డిక్రీ బాకీ వసులు పరపించమని పై కోర్టు నందు క్రెడిటర్ ఇన్‌సాల్‌వెంటు పిటిషను దాఖలు చేసియున్నాడు. కావున మీకు గాని, ఇంకా ఎవరికైనా గాని ఆక్షేపణలు వున్న యెడల **ది 21-06-2023 వ తేదీన ఉదయం 10-30** ల లగాయతు మీరు స్వయముగా కానీ మీతరపు న్యాయవాదితో గాని పై కోర్టు నందు హాజరు అయి మీ వాదనను తెలుపుకొనవలెను. లేనియెడల శ్రీ కోర్టు వారు మీకు పరోక్షంగా తీర్పు చెబుదురు.

శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం

రాజమహేంద్రవరం, ది06-06-2023.

M.K. మొహియుద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం.

గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక సేవలు

కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష కార్యక్రమం కింద ఇప్పటి వరకు కాకినాడ జిల్లాలో రీసర్వే పూర్తయిన 11 మండలాల్లోని 121 గ్రామాలకు సంబంధించి భూయజమానులు, పట్టాదారులు, రైతులకు వివిధ సేవలను గ్రామ సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ డా కృతికా శుక్లా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ల్యాండ్ పార్సిల్ నంబర్ ఆధారంగా పట్టాదారు ఆధార్ సీడింగ్, మ్యుటేషన్ బై కరెక్షన్, ఆటోమేటిక్ పట్టాదార్ పాస్‌బుక్ ఆర్డరింగ్, సబ్ డివిజన్, ల్యాండ్ కన్వర్షన్ సర్వీసులు గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. భూ యజమానులు/రైతులు తమకు కావాల్సిన సర్వీసు కోసం సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ద్వారా ఏపీసేవా పోర్టల్‌లో తగిన రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు.

గొల్లపాలెం జిజిఎస్‌లో మంటలు

భయంతో పరుగులు తీసిన జనం

విశాలాంధ్ర - రాజోలు : నియోజక వర్గంలోని మలికిపురం మండలంలోని తూర్పుపాలెం, గొల్లపాలెంలో జిజిఎస్‌లో వేస్ట్ గ్యాస్ ఫైర్ చేసే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ మంటలు భారీ ఎత్తున చెలరేగడంతో పక్కన ఉన్న గంటా వారి గ్రూపునకు చేరుకున్నాయి. పొగ మంటలు భయంతో ఆ గ్రూపు ప్రజలు ఇళ్లను వదిలేసి భయంతో బయటకు పరుగులు తీసారు. జిజిఎస్ అధికారులు మంటలు అదుపుచేసే పనిలో నిమగ్నమయ్యారు. కోనసీమలో గతంలో జరిగిన సంఘటనలతో ఓఎన్‌జీసీ అంటేనే జనం భయభ్రాంతులకు గురవుతున్నారని పలువురు అంటున్నారు.

ఉండ్రాజవరం పీహెచ్సీలో స్పెషలిస్టుల సేవలు

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉండ్రాజవరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో మూడవ శుక్రవారం స్పెషలిస్ట్ డాక్టర్లు వైద్య సేవలలో భాగంగా గైనకాలజిస్ట్ డాక్టర్ మృదుల ప్రసూతి స్త్రీల వైద్య నిపుణులు, ఊపిరితిత్తుల స్పెషలిస్ట్ డాక్టర్ మేరీ వసంత ఓపి సేవలు అందించారని ఉండ్రాజవరం పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్ ప్రసాద్ తెలిపారు. గైనిక్ సేవలో బాగంగా 24 మందిని, ఊపిరితిత్తులకు సంబం ధించి 5 గురిని పరీక్షించి, తగిన వైద్య సేవలు అందించారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శనివారం ఎముకల స్పెషలిస్ట్ జితేంద్ర శ్రీ ఫణి తేజ అందించే సేవలను అవసరమైన వారు వినియోగించుకోవాలని కోరారు.

ట్రాఫిక్ స్తంభన

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్ళపూడి మెయిన్ రోడ్‌లో నిత్యం రద్దీగానే ఉండటం ప్రజలు ఇబ్బంది ఎదుర్కోవడం సర్వసామాన్యంగా మారింది. కిలోమీటరు పొడవునా గల తాళ్ళపూడి మెయిన్ బజార్ చుట్టుపక్కల గ్రామాలకు కేంద్ర బిందువు. రోడ్డు కిరువైపులా షాప్ లు మార్కెట్ కొచ్చే వారికి కనీసం బైక్ పెట్టుకునేందుకు సైతం ఖాళీ లేని పరిస్థితి. ఆ చివరి నుండి ఈ చివరి వరకు అంతా ఆక్రమణ లే ఆక్రమణలు. ఆర్ అండ్ బి రోడ్ ను కలిపేసు కోవటంలో సిద్ధ హస్తులు తాళ్ళపూడి వాసులు. అడిగే నాథుడు ఉండడు. కొత్తగా భవనాలు నిర్మించే వారు సైతం ఆర్ అండ్ బి రోడ్ ను చేర్చే నిర్మాణాలు చేస్తున్నారు. మెయిన్ రోడ్డుకు ఇరుప్రక్కల డ్రెయిన్లు వున్నాయి. వర్షం వస్తే రోడ్డు నీటిమయమవుతోంది.

ఉద్యానశాఖ అధికారిగా కోటేశ్వరరావు బాధ్యతలు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట, ఉద్యాన శాఖ అధికారిగా జి కోటేశ్వరరావు బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఆ శాఖ అధికారిణి మంకు అనూష రామచంద్రపురంనకు బదిలీ అయ్యారు. హార్టికల్చర్ పరిశోధనలో సహాయకులుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేసిన కోటేశ్వరరావు ఏపీపీఎస్సీ పరీక్ష వ్రాసి హెచ్‌ఓగా ఎంపికై తొలి పోస్టింగ్‌గా కొత్తపేట ఉద్యానశాఖ అధికారిగా వచ్చారు. గురువారం ఆయన కొత్తపేటలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో తన సేవల్ని అందిస్తూ నిత్యం ఉన్నతాధికారులకు, రైతులకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలను అందిస్తానన్నారు.

విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలి

విశాలాంధ్ర-కొవ్వూరు :విద్యార్థులు సరైన క్రమశిక్షణతో పాటు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత శిఖరాలు ఖాయమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు తిరుమల దాస్ అన్నారు. కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ నీలిమ పేరెంట్స్ కమిటీ చైర్మన్ కవితలు ముఖ్య అతిథులుగా విచ్చేసి విద్యార్థులకు నగదు ప్రశంసా పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ అభివృద్ధిలోకి రావాలని కోరారు. మొదటి బహుమతిని విద్యార్థి దుర్గా కిరణ్, ద్వితీయబహుమతిని లలిత, తృతీయ బహుమతిని యు. రోషన్‌లకు అందజేశారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-కొవ్వూరు :ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. పట్నంలోని 7 ,8 సచివాలయాల్లో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రత్నకుమారి మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గరగా అందించేందుకు సీఎం జగన్ వాలంటీర్లు వ్యవస్థ ఏర్పాటు చేశారన్నారు. వాలంటీర్లకు ప్రోత్సాహక బహుమతులను 15వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర అందజేశారు.

విద్యుత్తు కోతతో ఇబ్బందులు

విశాలాంధ్ర - చాగల్లు : మండుతున్న ఎండలకు తోడు రాత్రులు పగలు అనే తేడా లేకుండా మండలంలో విద్యుత్ కోతలు విధించడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఎటువంటి ముందస్తు ప్రకటన లేకుండా రాత్రుల సమయంలో విద్యుత్ కోత విధించడంతో చంటి బిడ్డల తల్లులు, ముఖ్యంగా వృద్ధులు వేడికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు. రోహిణిలో రోళ్ళు పగులుతాయనే నానుడి ఎలా ఉన్నా మృగశిరలో కూడా మాడు పగిలిపోతుందని ఇటువంటి సమయంలో విద్యుత్ కోత విధించడం ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికీ వర్షాలు లేక వాతావరణం చల్లబడకపోవడంతో ఎండవేడికి గిలగిలలాడిపోతున్నారు. రాత్రులు విద్యుత్ కోత లేకుండా చూడాలని ప్రజలు అధికారులకు మనవి చేస్తున్నారు.

ఆలయ భూముల వేలంపాట

విశాలాంధ్ర- ముసునూరు: బలివే గ్రామ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ భూముల వేలంపాటలో రైతులు పాల్గొని వేలంపాట విజయవంతం చేయాలని బలివే గ్రామంలో వేంచేసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాధికారి ఆకుల కొండలరావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ముసునూరు మండలంలోని బలివే గ్రామంలోవేంచేసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానమునకు చెందిన ఆలయ భూములు ఆర్.యస్.నెం.118లో య.8-78 సెంట్లు భూమి, వేల్పుచర్ల గ్రామంలో ఆర్.యస్.నెం.376లో య.1-16 సెంట్లు భూమి.3 సంవత్సరాల కాలపరిమితి కౌలు వేలం పాట గాను ది.19.6.2023 వ తేది సోమవారం ఉదయం పదకొండు గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో టెండర్ కం,బహిరంగ వేలంపాట నిర్వహించబడునని, ఆదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయశాఖాధికారులు, పోలీస్, రెవిన్యూ, భక్తులు,గ్రామస్తుల సమక్షంలో శ్రీ స్వామి వార్ల హుండీ లెక్కించటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఒ తెలిపారు.

హౌసింగ్ అధికారులపై వైసీపీ నేతల అసంతృప్తి

విశాలాంధ్ర -చాట్రాయి : హౌసింగ్ అధికారులతో వైసీపీ నేతలు జరిపిన ప్రత్యేక సమావేశంలో అధికారుల తీరుపై వైసీపీ నేతలు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో నూజివీడు గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశం ముఖ్యమైన ఉద్దేశం ఇటీవల కాలంలో వైసీపీగ్రామ మండల నేతల హామీపైనూతనంగా ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన వారికి బిల్లులు ఇప్పించాలని లేకపోతే పార్టీకి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనేది ముఖ్యమైన ఉద్దేశం కావడం గమనార్హం. మండలంలో షుమారు 436ఇళ్ళకు బిల్లు ఇప్పించాలని వైసీపీ నేతలు కోరగా ఈఈ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్పెషల్ డిక్లరేషన్ ఇవ్వాలని అనడంతో వైసిపి సీనియర్ నాయకులు పోలవరం పిఎసిఎస్ చైర్మన్ చెలికాని బాబ్జి అసహనంతో సమావేశం నుంచి లేచి అందరికన్నా ముందు బయటకు వెళ్ళిపోయారు.అధికారులు అక్కడొక మాట ఇక్కడ ఒక్కమాట చెపుతున్నారని పలువురు అంటున్నారు.నాయకుల హామీతోనే ఇళ్ళు నిర్మాణం జరిగిందని వందలాది మంది కి ఏమని సమాధానం చెప్పాలి అనేది చర్చనీయాంశం అయింది.ఈసమావేశంలో ఎపి కోపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి తహశీల్దార్ విశ్వనాథ రావు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ప్రోగ్రామ్‌కు 9 మంది అర్హత

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,సీడాప్, ఉపాధి కార్యాలయం, హెచ్ సి ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన హెచ్ సి ఎల్ టెక్ బీ "క్యాంపస్ డ్రైవ్" కెరీర్ ప్రోగ్రాంకు 52 మంది అభ్యర్ధులు హాజరై 9 మంది మొదటి దశలో లో అర్హత పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ఉపాధి కార్యాలయం ప్రతినిధి వై పి ప్రవీణ్, కళాశాల కరస్పాండెంట్ జగదీష్ , హెచ్ సి ఎల్ సిబ్బంది సాయి కిరణ్ ,ఎపిఎస్ఎస్ డి సి సిబ్బంది ,పి ఒ ప్రవీణ్, ఈ ఎస్ సి కోఆర్డినేటర్స్ రామకృష్ణ, సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపవరం జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్, బాలుర స్కూలులలో డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ ఆర్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి కిరణ్మయి, మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు,నేత్ర వైద్యాధికారి ఐ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలికల హైస్కూల్లో 35 మందికి, బాలుర హైస్కూల్లో గణపవరంలో19 మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ ఎం బాల భాస్కర్ రావు, సి హెచ్ ఓ జె విల్సన్ బాబు, ఎ. కృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రన్నకు చేయూతనివ్వండి

విశాలాంధ్ర - చాట్రాయి : ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు కు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు.శుక్రవారం చాట్రాయి మండలం ఆరుగొలను పేట లో భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమం రెండోరోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు,మండలం టిడిపి అధ్యక్షులు మరిడి వేంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పాల్గొని దుర్గారావు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ చికిత్సకు సీఎం జగన్ 10 లక్షలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని కొప్పిగుంట గ్రామానికి చెందిన వైసిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు బొక్క రమణ (వెంకటేశ్వరరావు)కు కాలేయ చికిత్స నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 10 లక్షల రూపాయలను సీఎం సహాయ నిధి నుండి మంజూరు చేశారు. గత కొంతకాలంగా రమణ అనారోగ్యంతో బాధపడుతూ కాలేయ మార్పిడి నిమిత్తం ఏఐజి హాస్పిటల్, సికింద్రాబాద్‌లో వైద్యం పొందుతున్నారు. హాస్పిటల్ వారు ఇచ్చిన ఎల్ఓసి ప్రకారం ముమ్మిడివరం శాసనసభ్యులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించగా స్పందించిన సీఎం పార్టీ కోసం పనిచేసిన రమణకు 10 లక్షలు మంజూరు చేశారు. మంజూరు ఉత్తర్వులను ఎమ్మెల్యే సతీష్ కుమార్ బాధితుడు రమణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంది కుప్ప సొసైటీ అధ్యక్షులు ఏడిదసుబ్బారావు, మాజీ జెడ్పిటిసి పాలెపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఆలమూరు : ఈ నెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనగన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా 'సురక్ష' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తహసీల్దార్ ఐపీ.శెట్టి తెలియజేశారు. శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆలమూరు మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ గ్రామ వలంటీర్, సచివాలయం సిబ్బంది,గృహసారథులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యలు ఆరా తీయాలని సూచించారు. గతంలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను 'సురక్ష'లో భాగంగా వారికి స్వయంగా చెప్పాలని ఆదేశించారు. ఏ ఒక్కరికీ సచివాలయ పరిధిలో సమస్యలు లేకుండా అధికారులు చూడాలన్నారు.మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌తో 'సురక్ష' కమిటీని నియమించాలని కమిటీ ఎప్పుడు పర్యటిస్తుందో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6,7,8 క్లైములు పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర భీమవరం:జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఈఆర్ఓ.నెట్, ఈవిఎం గౌడౌన్లు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఈపి కేసులు, ఎస్ఓపిలు, వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లు, తదితరులతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, డిఆర్ఓ కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఫామ్-6 క్లైములకు సంబంధించి 5,800 ఫామ్స్ రాగా, 862 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తా మన్నారు. ఫామ్-7 క్లైములకు సంబంధించి 2,549 ఫామ్స్ రాగా, 241 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, ఫామ్-8 క్లైములకు సంబంధించి 1,895 ఫామ్స్ రాగా, 354 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్డీవో దాసిరాజు, ఆర్ఓలు, ఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

వెంగయమ్మతల్లి ఆలయానికి స్థల దానం అభినందనీయం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కిర్లంపూడి మాన్యాలు ఆయకట్టు రైతులను, రైతు కూలీలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్న శ్రీ వెంగయమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రెండు సెంట్లు పంట భూమి స్థలాన్ని అమ్మవారి ఆలయానికి దానం చేయడం ఎంతో అభినందనీయమే గాక, శుభ పరిణామమని, అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత, శ్రీ వనదుర్గా దేవి అమ్మవారి ఆలయ అభివృద్ధి ప్రదాత సేనాపతి కన్నబాబు, శ్రీ సత్య సాయి సేవా సమితి అధ్యక్షులు ఒబ్బిలిశెట్టి బద్రి, పలువురు ఆయకట్టు రైతులు అన్నారు. కిర్లంపూడి మాన్యాలు పొలంలో ఎప్పటినుండో కొలువైయున్న రైతుల పాలిట కల్పవల్లి శ్రీ వెంగయమ్మ తల్లి ఆలయానికి కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన కీర్తిశేషులు గొడే లక్ష్మీనారాయణ, గొడే రాంబాబుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గొడే చంద్రశేఖర్ గురువారం రైతుల సమక్షంలో కొలతలు వేహించి అమ్మ వారి ఆలయానికి అప్పజెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క అడుగు నేల వదలని ఈ రోజుల్లో అమ్మవారి ఆలయ నిర్మాణానికి అడగ్గానే ఎంతో విలువైన రెండు సెంట్లు పంట భూమిని ఉదారంగా ఇవ్వడం పట్ల చంద్రశేఖర్‌ను పలువురు ఆయకట్టు రైతులు అభినందించడమే, కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా గొడే చంద్రశేఖర్ మాట్లాడుతూ మా తండ్రి గొడే లక్ష్మీనారాయణ, చిన్నాన్న రాంబాబుల కోరిక మేరకు వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, మా వెంగయమ్మ తల్లి ఆశీస్సులు మా కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని అమ్మ వారి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ నిర్మాణంలో కూడా తమ వంతు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేనాపతి కన్నబాబు మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి అడగ్గానే స్థలం ఇచ్చిన తన మిత్రుడు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేయమే కాకుండా, ఆలయ అభివృద్ధికి ఎవరి దగ్గర విరాళాలు తీసుకోకుండా, ఆలయ అభివృద్ధి తానే చేస్తానని కన్నబాబు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాయి మాధవి విద్యార్థులు

విశాలాంధ్ర - అనపర్తి : ఆదికవి నన్నయ యూనివర్శిటీ డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీ సాయిమాధవి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ఎన్ నవీన్ తెలిపారు. బీఎస్సీ విభాగంలో టి.దుర్గాభవాని 9.8, ఎస్.లక్ష్మి 9.8, ఎం.నందిని 9.8, టి.విద్యా స్వప్నిక 9.8, కె. సౌమ్య శ్రీ 9.8, ఎస్.చిన్న సతీష్ రెడ్డి 9.6, ఎం.దుర్గా శిరీష 9.6, సిహెచ్. సురేఖ 9.5, ఎమ్.లక్ష్మీ లలిత 9.4, పి.కీర్తన 9.4, జి.గాయత్రి 9.4, ఎ.కళ్యాణి 9.3, ఎ.వి. పద్మావతి 9.3, డి.ఉషా రాణి 9.2, వై.రేణుక 9.2, వి.సత్యవేణి 9.1, ఎస్. మౌనిక 9.1, బి.లక్ష్మి అపర్ణ 9.1, పి.సత్య భాగ్య శ్రీ 9.0, టి.పావని 9.0, ఎన్. సత్యవేణి 9.0, ఎల్. మంజుల 9.0, ఎమ్.వినీత 8.9, ఒ. ప్రసన్న భవ్య శ్రీ 8.8, ఎమ్.అరుణ 8.7, ఎమ్.అబ్బాస్ హుస్సేన్ 8.7, బి.లావణ్య 8.5 పాయింట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. బీకాం విభాగంలో డి.మౌనిక 9.0పాయింట్లు సాధించారని నవీన్ చెప్పారు.మొత్తంగా బిఎస్సి విభాగంలో 97.6 శాతం బీకామ్ విభాగంలో 96.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన చెప్పారు.యూనివర్శిటీ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎంఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి, శ్రీసాయిమాధవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ తేతలి రామభద్రారెడ్డి(మల్లంపూడి),సత్యభామ స్కూల్ డైరెక్టర్ ఎం.మాధవీలత, ఎమ్ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ తాడి సతీష్ రెడ్డి అభినందించారు.

రోటరీ సేవలు సంతృప్తినిచ్చాయి

విశాలాంధ్ర-నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర రామ్ అన్నారు.గవర్నర్ అఫీషియల్ విజిట్ లో భాగంగా ఆర్ఐ3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ ఏ కె ఎస్ భాస్కర రామ్ విశ్వనాథం శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ కు విచ్చేసినారు. క్లబ్ అధ్యక్షులు మాచర్ల మధుసూదనరావు , ఇతర సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమం పాల్గొన్నారు తిమ్మరాజుపాలెం లింగంపల్లిలో ఉన్న శ్రీ బండి సూర్యనారాయణ లక్ష్మీకాంతమ్మ రోటరీ సెంట్రల్ వద్ద శ్రమను సందర్శించి ఆశ్రమంలో జరుగుతున్న అభివృద్ధి అడిగి తెలుసుకున్నారు.వృద్ధాశ్రమ అభివృద్ధి పనులకు,రూ250000/ను వృద్ధాశ్రమ గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాలకృష్ణ కు అందజేసారు అనంతరం నిర్వహించిన క్లబ్బు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాచర్ల మధుసూదన రావు మాట్లాడుతూ 2022-2023 ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు 38 క్యాంపులు, వివిధ ప్రదేశాలలో 16 క్యాంపులు ద్వారామొక్కలు నాటడం, స్కూల్లో కాలేజీల్లో విద్యార్థిని విద్యార్థులకు హ్యాండ్ వాష్ 14 ప్రోగ్రామ్స్,విద్యార్థిని విద్యార్థులకు 14 మెడికల్ కిడ్స్ అందజేయడంతో పాటు, కాలేజీ ,స్కూల్లో ఫీజులు చెల్లించలేని విద్యార్థిని విద్యార్థులకు ఫీజులు చెల్లించడం జరిగిందని మధుసూదనరావు వివరించారు. ప్రజలలో పోలియో అవగాహన కొరకు పోలియో ర్యాలీ నిర్వహించడం జరిగింది. బైత్సాహిక కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు ,కంటి ఆపరేషన్ చేయించడం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు.గవర్నర్ ఏ కె ఎస్ భాస్కర రామ్ విశ్వనాథం మాట్లాడుతూ నిడదవోలు సెంట్రల్ సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అరటి నష్టం ప్రాథమిక అంచనా

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం, రౌతులపూడి మండలాలలో ఉన్న గ్రామాలలో మంగళవారం వీచిన భారీ గాలులకు 42.5 ఎకరాలు అరటి తోటలలో నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖాధికారి పి.అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం శంఖవరం మండలంలోని మండపం, కె. గౌరంపేట గ్రామాలలో నేలకొరిగిన అరటి తోటలను మండపం సచివాలయ ఉద్యానవన సహాయకులు శ్యాంసుందర్ వాలంటీర్లతో కలిసి ఉద్యానవన శాఖాధికారి అరుణ్ కుమార్ అరటి తోటలను పరిశీలించారు. 42.5 ఎకరాలు అరటి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. మామిడిలో పురుగులు పడుతున్నాయని దీని కారణం తెలియజేయాలని రైతు వేల్పుల రమణ అడిగారు. పండుగ అధికం కావడం వలన ఇలా జరుగుతుందన్నారు. పక్వానికి వచ్చిన పండ్లను కోయకుండా ఉంచోనట్లయితే ఈగ వాలిన కాయలపై మచ్చలు ఏర్పడి పురుగులు పడతాయని నివారణ కోసం బుట్టలను అమర్చుకుని మందులను పిచికారి చేయాలన్నారు. ఉధ్యానవన శాఖలో కొబ్బరి, మామిడి, జీడి మామిడి, మొక్కలకు సంవత్సరానికి ఒక్కో మొక్కకు 20రూపాయలు చెప్పిన రెండు సంవత్సరాల పాటు వస్తాయని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరానికి అరవై కొబ్బరి మొక్క లు వేసుకోవచ్చునన్నారు. చిరుధాన్యాలు అనగా రాగులు, చోళ్ళు, కొర్రలు, సజ్జలు విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. సమీపంలో రైతు కేంద్రాలను సంప్రదించాలని ఆయన తెలిపారు. సచివాలయంలో యూరియా అందుబాటులో ఉన్నదని తెలియజేశారు.

కల్వర్టు పరిశీలించిన ఎమ్మెల్యే సత్తి

విశాలాంధ్ర - అనపర్తి : రాజానగరం-పెదపర్తి రోడ్డులో రామవరం పరిధిలో ఆర్ అండ్ బి ప్రత్యేక మరమ్మతు నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన కల్వర్టు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్న గుత్తేదారు, ఆర్ అండ్ బి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరితగతిన నాణ్యతతో కూడిన సిమెంట్ కల్వర్టు నిర్మాణం చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసి చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కర్రి గాంధీ రెడ్డి, టేకి బాబురావు, కోనాల సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ ట్రోఫీ వెస్టిండీస్ టీం కైవసం

విశాలాంధ్ర - గోపాలపురం : క్రీడలు యువతకు దేహదారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ నేటితో ముగిసింది. 15 రోజులపాటు నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్లో 40 టీములు పాల్గొన్నాయి. ఫైనల్ లో గోపాలపురం కు చెందిన వెస్టిండీస్ టీం, కొవ్వూరు 11 టీములు ఓర హూరిగాతలపడ్డాయి. గోపాలపురం చెందిన వెస్టిండీస్ టీం 45 పరుగుల తేడాతో విన్నర్స్ గా నిలిచి ట్రోఫీ తో పాటు రూ 30, వేలు నగదు కైవసం చేసుకుంది. రన్నర్స్ గా నిలిచిన కొవ్వూరు 11 టీం ట్రోఫీతో పాటు 20వేల రూపాయలు నగదు అందుకున్నారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ కీపర్, ఫీల్డర్ లకు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుని ఎన్టీఆర్ పేరట టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్టీ రామారావు ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగల సత్యనారాయణ, కొర్లపాటి రాము, జేష్ట శ్రీనివాసరావు, జ్యేష్ట శ్రీధర్, మద్దిపాటి రమేష్, ఈలి శరత్ బాబు, మద్దిపాటి రోహిత్ సాయి ఎంట్ర ప్రగడ మంగారావు, పడమటి శ్రీనివాసరావు యువత పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన జీలుగు విత్తనాలు సీజ్

విశాలాంధ్ర-టీ నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో కొనకళ్ళ పవన్ కుమార్ కు చెందిన సత్య ఎంటర్ ప్రైజెస్ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన 450 కేజీల జీలుగు విత్తనాలు సీజ్ చేసి షాపు యజమాని పై కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి ముత్యాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్, సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో బొర్రంపాలెంలో కొనకళ్ళ పవన్ కుమార్ కు చెందిన గోదాములో ఎటువంటి అనుమతులు లేకుండా 13వేల 5వందల విలువ కలిగిన మూడు రకాల బ్యాగ్ లలో తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుండి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. 1955చట్టం ప్రకారం షాపు యజమాని పై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎటువంటి అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు విక్రయాలు చేసినా అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

చలో రాజానగరం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని మావిడి, జీడి మావిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పేందుకు జనసేన పార్టీ తలపెట్టిన ఛలో రాజానగరం, ధర్నాను ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని జనసేన నాయకులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా జీడిమామిడి,మామిడి రైతులు పంటలు సరిగ్గా పండక,పండినా సరైన గిట్టుబాటు ధరలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు.వీటిపై గళం విప్పేందుకు జనసేన ఆధ్వర్యంలో ఈ నెల 17న స్థానిక గాంధీ బొమ్మ వద్ద ఉదయం పది గంటలకు రైతులతో ధర్నా చేపట్టినట్లు చెప్పారు.కార్యక్రమాన్ని ప్రతి రైతు,నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు భారీగా తరలివచ్చి విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.



అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అనపర్తి : కుతుకులూరు చెరువు వద్ద అగ్ని ప్రమాదంలో నాయీ బ్రాహ్మణులకు చెందిన రెండు షాపులు పూర్తిగా దగ్ధం కావడం జరిగింది.దీంతో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నాయీ బ్రాహ్మణులకు మురళి ఫ్రెండ్స్ సర్కిల్ తక్షణ సహాయం గా ఒక్కొక్కరికి రూ. 5 వేలు ఆర్థికసహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి సురేష్, గ్రామ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (పెద్దోడు),వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి మురళి వెంకట కృష్ణా రెడ్డి ,తమ్ముడు శ్రీను, పోతంశెట్టి నాగిరెడ్డి, తేతల సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ ఎస్. సుగుణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు కాకినాడ జెఎన్‌టియు మేనేజ్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న సి.సురేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లాజిస్టిక్స్ ఎగుమతులు, దిగుమతులు వంటి అంశాలలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతుల గురించి వివరిస్తూ విద్యార్థులు లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ విద్యను మారుతున్న కాలానుగుణంగా ప్లానింగ్, సోర్సింగ్ మాన్యుఫాక్చరింగ్, డెలివరీ వంటి అంశాలపై పరిజ్ఞానం పెంపొందించుకున్నప్పుడు మాత్రమే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. ముఖ్య అతిథిని ఆదిత్య యాజమాన్యం తరఫున దుశ్శాలువా, జ్ఞాపిక యిచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం. గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా వసూలు చేసిన డబ్బు తిరిగి రైతులకు ఇప్పించాలి

విశాలాంధ్ర - రావులపాలెం : అకాల వర్షాలు, తుపాన్ల కారణంగా పంట నష్టపోయిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లుల వద్ద అక్రమంగా వసూలు చేసిన డబ్బును తిరిగి ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ కోరారు. కొత్తపేట నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి బండారు సత్యానందరావు సూచనల మేరకు శుక్రవారం రావులపాలెం మండలం గోపాలపురం, ఈతకోట గ్రామాల్లో ఆకుల రామకృష్ణ అధ్యక్షతన రైతు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతుల నుంచి ఈనెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తుల రూపంలో వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, పరిహారం ఇవ్వని పక్షంలో రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వమే పరిహారం అందజేస్తుందన్నారు. రైతులు తాము సాగుచేసిన భూమి విస్తీర్ణం, పంట నష్టం జరిగిన విధానం, రవాణా ఖర్చులు, హమాలీ ఖర్చులు, కల్లం ఖర్చులు, మిల్లుల్లో అదనంగా తూచిన ధాన్యం వెరసి రైతు నష్టపోయిన వివరాలను తమకు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, కొత్తపేట నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జక్కంపూడి వెంకటస్వామి, గోపాలపురం, ఈతకోట గ్రామ పార్టీ అధ్యక్షులు మండలంలోని 12 గ్రామాల పార్టీ రైతు అధ్యక్షులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహానేతల విగ్రహాల ధ్వంసం తీవ్రంగా ఖండిస్తున్నా

విశాలాంధ్ర - సీతానగరం: మహానేతల విగ్రహాల ధ్వంసం తీవ్రంగా ఖండిస్తున్నా అని వైఎస్ఆర్సీపీ ఉబయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలో గల ఇనుగంటి వారిపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మహానేత స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు గారి విగ్రహం ధ్వంసం చేశారు. దీనిని పరిశీలించడానికి జక్కంపూడి గణేష్ శుక్రవారం చేరుకొని స్థానిక నాయకులు, పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ విలేకరులతో మాట్లాడుతూ కుల మత ప్రాంతాలకు అతీతంగా ఏ మహానేత విగ్రహం ధ్వంసమైనా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజలకు వారు చేసిన సేవలను బట్టి ప్రజలలో వారి పేరు ప్రఖ్యాతులు ఉంటాయని అవి ఇలాంటి విగ్రహాల ధ్వంసం వల్ల చెరిగి పోవు అని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులను పోలీసులు దర్యాప్తు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు వల్ల ప్రజల మనోబావలు దెబ్బతింటాయని అని అన్నారు. ఈ విగ్రహం, వంగలపూడి గ్రామంలో గల వంగవీటి రంగా గారి విగ్రహాలను స్థానిక నాయకులు త్వరలో తిరిగి నెలకొల్పుతారు. అలగే వీటి భద్రతకు సి సి కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ మదన్ బాబు, కో కన్వీనర్ హరిబాబు, మొదలగు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.